

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఐడియల్ విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

ఐడియల్ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్సెస్(ఏ) సెకండ్ బికాం విద్యార్థి వి.మణికంఠ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ ఎంపిక కావడం పట్ల కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి అభినందించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వైఆర్ఎల్.చౌదరి మాట్లాడుతూ ప్రీ రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికైన వి. మణికంఠ మహారాష్ట్రలో జరిగే పది రోజుల క్యాంపునకు హాజరు కావడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ టి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. స్టీవెన్ రాజు, అకాడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్, వి.నాగేశ్వరరావు, డాక్టర్ కె.స్వామీజీ, డిపిఎస్ కిరణ్, డి. విశ్వనాథరాజు, పలువురు అధ్యాపకులు మణికంఠను అభినందించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రాలు

- నత్తనడకన నూతన భవన నిర్మాణాలు
- వెంటాడుతున్న నిధుల కొరత
- కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు గత వైసిపి పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. నిధుల కొరతతో పాటు చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. 2022 జులైలో నిర్మాణాలు మొదలుపెట్టిన పాలన పూర్తయ్యే లోపు భవన పనులను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. కూటమి ప్రభుత్వంలోనూ అదే తీరు కనిపిస్తున్నట్లుగా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడిచినప్పటికీ వాటి నిర్మాణాలలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సొంత భవనాలుండగా మిగిలినవి అద్దె భవనల్లో కొనసాగుతున్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు ఉన్నారు. 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. జిల్లాలో 1986 కేంద్రాల్లో 706 సొంత కేంద్రాలు ఉండగా 1107 అద్దె భవనాల్లో, రెంట్ ఫ్రీలో 173 నడుస్తున్నాయి.

ఐసిడిఎస్ సేవలపై నిర్లక్ష్యం

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు చాలా కీలకంగా వ్యవహరిస్తున్నాయి. సక్రమంగా ఐసిడిఎస్ సేవలను అందించేలా ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ కొత్త భవనాల నిర్మాణంపై సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ఉన్న వాటిల్లో కొన్ని సొంత భవనాల్లోనే నిర్వహిస్తుండగా ఇంకొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. పలుచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరి ఉన్నాయి. దీంతో లబ్ధిదారులు, సిబ్బంది భయం భయంగా గడపాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా పనులపై శ్రద్ధ చూపలేకపోయింది.


పిఠాపురం మండలం సింహాద్రిపురంలో మధ్యలోనే నిలిచిపోయిన భవన నిర్మాణం


పిఠాపురం మండలం రాపర్తిలో పునాది దశలోనే నిర్మాణం

7 భవనాలే పూర్తి

గత సర్కారు నాడు-నేడు రెండో విడతలో భాగంగా 2022 జూలై 26న 98 అంగన్‌వాడీ నూతన భవనాలను మంజూరు చేసింది. ఒక్కోదానికి రూ.13.5 లక్షలు, ఫర్నిచర్ కోసం రూ.2.5 లక్షలు కేటాయించింది. పంచాయతీరాజ్, సమగ్రశిక్షాభియాన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఇంజినీరింగ్ అధికారులతో పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వీటిలో గత ప్రభుత్వ హయాంలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడుకు బదులు మనబడి-మన భవిష్యత్తుగా, పేరును మార్చి అమలు చేస్తోంది. ఇప్పటివరకు తుని మండలంలో వెలమ కొత్తూరు, గాంధీనగర్, శంఖవరం మండలంలోని శంఖవరం, వి.వెంకటాపురం, పెద్దాపురం మండలంలోని మర్లవలో ఒకటి, కట్టమూరులలో రెండు కేంద్రాలు మొత్తం 7 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. జగ్గంపేట మండలంలో 15, పెద్దాపురం మండలంలో 3, పిఠాపురం మండలంలో 12, తాళ్లరేవు మండలంలో 6, తుని మండలంలో ఒక చోట స్లాబులు పడ్డాయి. 4 భవనాలు ఇంకా పునాదుల దశలోనే ఉన్నాయి. 36 చోట్ల పై కప్పు స్థాయి వరకూ ఇటుక పని పూర్తి అయింది. కిర్లంపూడి మండలంలో రెండు చోట్ల కోర్టు కేసులు వలన పెండింగ్లో ఉన్నాయి. గతేడాది జూన్ నాటికే అన్ని భవన నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉంది. పలు చోట్ల పనులు మధ్యలోనే ఉండిపోవడంతో ఐసిడిఎస్ సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిధులు విడుదలలో జాప్యమేనా..?

నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ప్రతి నెలా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నిధులు విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో పలు భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఒక్కో భవనానికి రూ.13.5 లక్షలు కేటాయించగా కేవలం 40 శాతం మాత్రమే ఇప్పటి వరకు బిల్లులు మంజూరు చేశారు. దీంతో పనులు చేయలేక, చేసేదేమీ లేక మధ్యలో నిలిపివేశామని నిర్మాణదారులు చెబుతున్నారు.

త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం

అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనులను ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిధులు విడుదలలో ఎటువంటి జాప్యం లేదు. అతి త్వరలోనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. కూటమి సర్కారు వచ్చిన తర్వాత నిర్మాణంలో వేగవంతం అయ్యాయి.

-ప్రవీణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్


జనవాణిలో వినతిపత్రం అందిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికులకు పని కల్పించాలి

ప్రజాశక్తి- గొల్లప్రోలు

భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని, ఇసుకను ఉచితంగా అందుబాటులో తీసుకురావాలని కోరుతూ మండలంలోని చేబ్రోలులో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనిన్ పిఠాపురం పట్టణ అధ్యక్షులు డి.సత్యనారాయణ, చేబ్రోలు నాయకులు పి.రమణ, యు.కొత్తపల్లి నాయకులు సిహెచ్.సాంబశివ మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఇసుకను ఉచితంగా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా నేటికీ ఇసుకను అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులు ఉపాధి దూరమయ్యారన్నారు. వారి కుటుంబాలు దుర్భర జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇసుకను అందుబాటులోకి తేవాలన్నారు. ఇసుక సరఫరాపై ప్రభుత్వం స్వయం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో భవన నిర్మాణ రంగ కార్మికులు సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు బోర్డును పునరుద్ధరించి పెడింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.చిన్న, విశ్వనాథం, కె.రమణ, నందీశ్వరరావు, పి.వీరబాబు, ఎస్.సత్తిబాబు, కెవిపి.సత్యనారాయణ, డి.నాగేశ్వరరావు, ఎ.వాసు, ఎం.సత్తిబాబు, కరణం శ్రీను, వజ్రం తదితరులు పాల్గొన్నారు.

'నా ప్రాణాలకు రక్షణ కల్పించండి'

ప్రజాశక్తి - ఏలేశ్వరం


తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

తన భర్త కుటుంబీకుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని తిరుమాలి గ్రామానికి చెందిన టేకు నాగమణి తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ తన భర్త వీరబాబు చని పోయారని, అత్త, మామలు ఇచ్చి న ఆస్తి కోసం ఆయన అన్నదమ్ములు తనను ఆస్తి కోసం హత్య చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నా రు. ఇంటి పన్ను, పొజిషన్ సర్టిఫికెట్, కరెంటు బిల్లులు ఉన్నా సరే ఇంటిని కాళీ చేయాలని దాడులు చేస్తున్నారని, వారికి పలువురు రాజకీయ నాయకులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. బాధిత మహి ళకు సిపిఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర కార్య దర్శి కొసిరెడ్డి గణేష్ మద్దతు పలికారు. బాధితులకు రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నవీన్‌కుమార్

ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిఎస్‌సి ఉచిత కోచింగ్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు అధికార పగ్గాలు చేపట్టిన వెంటనే డిఎస్‌సి మీద దృష్టి సారించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే జగ్గంపేట నియోజకవర్గంలో డిఎస్‌సికి అర్హులైన వారికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఇప్పటికే 600 మంది అభ్యర్థులు కోచింగ్ తీసుకున్నారని తెలిపారు. అలాగే నేటి నుంచి 110 రోజులపాటు మరో బ్యాచ్‌కి కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలో ఉన్న డిఎస్‌సి అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ పేరు మీద పెళ్లి కానుకగా రూ.20 వేలను అందిస్తున్నామని, ఎవరైనా వివాహం చేసుకునే వారు 9 రోజుల ముందు సమాచారం అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, వెములకొండ జోగారావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి - సామర్లకోట


హెల్ప్‌డెస్క్‌లో రైల్వే అధికారులు

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్క్ సేవలు ఏర్పాటు చేశారు. తుపాన్ కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు, మరికొన్ని రైళ్ళ రూటులను మార్పు చేసినట్టు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. సామర్లకోట పరిసర ప్రాంతాల ప్రయాణీకులు రైళ్ళ వివరాలు తెలుసుకునేందుకు 0884-2327010 నంబర్‌కు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల ప్రయాణీకులు 0883-2420541 నంబర్లను సంప్రదించి ఫోనుద్వారా సమాచారన్ని పొందాలన్నారు.

కచేరిపేటలో మద్యం షాపును తొలగించాలి

ప్రజాశక్తి - కాకినాడ


విలేకరులతో మాట్లాడుతున్న శ్రామిక మహిళా శాఖ ప్రతినిధులు

కాకినాడ కచేరి పేటలోని యుటిఎఫ్ భవన్ చెంతన ఉన్న మద్యం షాపును వెంటనే తొలగించాలని శ్రామిక మహిళలు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక యుటిఎఫ్ భవన్ వద్ద యుటిఎఫ్ మహిళా నాయకురాలు దేవి, నసీఫా, భువనేశ్వరి, అప్సరి జహరి, నర్ల ఈశ్వరి శ్రామిక మహిళా శాఖ నాయకురాలు సిహెచ్.వేణి, ఐద్వా నాయకులు భూలక్ష్మి, రాణి తదితరులు మాట్లాడారు. యుటిఎఫ్ భవనం ఎదురుగా ఉన్న రోడ్డు మార్గంలో పయనిస్తున్న మహిళలకు ఇబ్బందికరంగా ఉన్న మద్యం షాపును తక్షణం తొలగించాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం డ్యూటీలకు వెళ్లి వచ్చేటప్పుడు తమ వాహనాలను యుటిఎఫ్ బిల్డింగ్ వద్ద పెట్టుకుని తమ విధులకు వెళ్తుంటారన్నారు. ఆ క్రమంలో యుటిఎఫ్ ఆఫీసు వద్దకు వచ్చేసరికి పక్కనే ఉన్న మద్యం షాపు వద్ద మందుబాబులు మద్యం బాగా సేవించి రోడ్డుకు అడ్డంగా ఉంటున్నారన్నారు. మహిళలు వెళ్లడానికి ఇబ్బంది పడే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికారుల దృష్టికి మద్యం దుకాణం తొలగించాలని పలుమార్లు విన్నవించామన్నారు. ఇప్పటికనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించకపోతే అవసరమైతే ఉద్యమం చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు.

సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - కోటనందూరు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ యనమల దివ్య

ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. గురువారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో తుని నియోజకవర్గ నాయకులతో సమీక్షా సమావేశం జరిగిం ది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు నెలల్లో వరుస తుపానులు ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని, వరద నీరు ఉధృతికి గండిపడిన చెరువులకు, పంట కాలువలకు, స్లూయిస్‌కు మరమ్మతులు నిర్వహించి ఖరీఫ్ వరి పంట పొలాలకు సాగునీరు అందించే దిశగా కృషి చేస్తామని అన్నారు. తుని పట్టణంలో పారిశుధ్యాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకో వాలని, ప్రజలతో నాయకులు మమేకం అయి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొప్పన రాము, ఇనుగంటి సత్యనారాయణ, మల్ల గణేష్, మోతుకూరి వెంకటేష్, తటవర్తి రాజా, కుక్కడపు బాలాజీ, లంక సునీల్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, పోలిశెట్టి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ సేవలు మరింతగా విస్తరించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు


బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

శ్యామల విజయ ట్రాన్స్ పోర్ట్ సేవలు మరింత విస్తరించాలని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. గురువారం శ్యామల విజయ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన 4 బస్సులు అండర్ టేకిన్‌పై ఆర్‌టిసి తుని డిపోకు ఇస్తున్న సందర్భంగా ఆ బస్సులను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ, అమలాపురం డిపోలకు మరిన్ని ఆర్‌టిసి సేవలు విస్తరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామల విజయ ట్రాన్స్‌పోర్ట్ అధినేత ఉల్లింగి విజయ్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, మాజీ జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి, వాసంశెట్టి శ్రీనివాస్, జక్కల ప్రసాద్‌బాబు, కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, నడింపల్లి వినోద్, మోర్త భైరవమూర్తి, ధూళిపూడి బాబీ, ఉమామహేశ్వరి, దాసరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై వేధింపులు ఆపాలి


ప్రజాశక్తి - కాకినాడ


డ్వామా పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలని యూనియన్ కోరింది. రాజకీయ వేధింపుల వల్ల కరప మండలం పెనుగుదురు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్‌తోపాటు, డ్వామా పీడీలకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు. ఈ సంధ్బంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కడమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తమపై రాజకీయ వేధింపులు పెరిగాయని దానిని తక్షణమే అరికట్టాలన్నారు. మండల పరిధిలోని బదిలీలు చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరిస్తామని జెసి, పీడీలు హామీ ఇచ్చారని తలెఇపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సలాది శ్రీనివాస్, రాయుడు శివసత్యనా రాయణ, గొల్లపల్లి ప్రదీప్ కుమార్, గుబ్బల సత్యవేణి, సిద్ధాంతపు శివ పాల్గొన్నారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు


గొంతిన సురేష్

మండలంలోని లంపకలోవ గ్రామంలో ఈ నెల 26న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గొంతిన సురేష్ తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో కాకినాడ అంజు కంటి ఆసుపత్రి వైద్యులు రెటీనా నిపుణులు డాక్టర్ తేజ సేవలందిస్తారన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని, కళ్లజోళ్లు ఉచితంగా అందిండచం జరుగుతుందన్నారు. అలాగే ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి వారికి ఆపరేషన్లను ఉచితంగానే అందిస్తారని తెలిపారు. ప్రతి ఏడాది అక్టోబర్ 26న లంపకలోవ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరగా ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కరప


ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి నియోజకవర్గ ఎంఎల్‌సి ఓటును ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ త్వరితగన నమోదు చేసుకోవాలని సిపిఎస్ జిల్లా కన్వీనర్ వాకాడ వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో కోరారు. నవంబర్ 6వ తేదీ ఓటు నమోదుకు చివరి తేదీ అని, పాతవారు మరల కొత్తగా నమోదు చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజపూడి సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇండస్ట్రీయల్ ఫీడర్, రాజపూడి, సీతారాంపురం, గోవిందపురం, మల్లిశాల, కొత్తూరు, బలబద్రపురం, జగ్గంపేట శివారు జగనన్న కాలనీ, స్థానిక గోకవరం రోడ్డు, ఎంప్లాయిస్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

కార్టూ'నిజం'



నివాసాల మధ్య సెప్టిక్ ట్యాంకర్లు

ప్రజాశక్తి - సామర్లకోట


బిసి వసతి గృహం వద్ద ఉంచిన ట్యాంకర్

పట్టణ పరిధిలోని 1వ వార్డులో ఉన్న ఎస్‌సి, బిసి బాలికల వసతి గృహాల వద్ద సెప్టిక్ ట్యాంకర్‌లు నిలిపి ఉంచడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో సెప్టిక్ వ్యర్థాలను రాత్రి సమ యాల్లో వదిలిపెట్టడంతో తమ ఆరోగ్యం దెబ్బతింటోందని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వసతిగృహాలతోపాటు, 3, 9 వార్డులకు సంబంధించిన సచివాలయాలు, రాజీవ్ గృహకల్ప సముదాయాలు కల్గివున్న ప్రాంతంలో సెప్టెంక్ ట్యాం కర్లను ఉంచడంతో వాటినుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేకపో తున్నామని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా వాటి నిర్వాహకులకు మద్దతు ఇస్తున్నట్లుగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా నివాసాల వద్ద సెప్టిక్ ట్యాంక్‌లు ఉంచకుండా చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్యాంకర్ పక్కనుంచే పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జానకి

సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

అత్యధిక శాతం మెట్ట ప్రాంతాలలో కర్ర పెండలం దుంప సాగు చేస్తున్న రైతులు దుంప పరిశోధన కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి అన్నారు. గురువారం స్థానిక కర్ర పెండలం దుంప పరిశోధన కేంద్రంలో మల్లవరం దళిత రైతులకు ఎస్‌సి సిపి పథకంలో మంజూరైన స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కర్ర పెండలం దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తల సూచనలను పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నారు. దుంప విత్తనం కర్ర తయారీ, నాట్లు వేయడం, కలుపు తీయడం, ఏ ఏ సమయాల్లో ఎంత మోతాదులో ఎరువులు, పురుగు మందులు వినియోగించటం, చీడపీడల నిర్మూలన పద్ధతులు వంటి వాటిపై దుంప రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త పి.సునీత పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో నాటు సారా మాఫియాపై నిఘా పెట్టామని ఎక్సైజ్ సిఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. నాటు సారా తయారు చేసినా, అమ్మకాలు నిర్వహించినా కేసులు తప్పవన్నారు. ఏలేశ్వరం మండలంలోని తిరుమాలి గ్రామంలో గురువారం ఉదయం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వంశీరామ్, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్, కానిస్టేబుల్ కిరణ్ పాండే, సత్యనారాయణ పాల్గొన్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం - రాజమహేంద్రవరం ఎడిబి రోడ్డు సూరంపాలెం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొట్టుకున్నాయి. అదే సమయంలో ఆటో వెనుక వస్తున్న మరో ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక ఆటో తిరగబడటంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. గాయపడిన ముగ్గురిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని కోరంగి పోలీసులు తెలిపారు. కోరంగిలో ఆర్‌టిసి బస్సు ఎక్కి యానాం వరకు టికెట్ తీసుకున్న ఈ వ్యక్తి, నీరసిల్లి పడిపోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు వెంటనే 108కు సమాచారం ఇచ్చి తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఆయన సమాచారం తెలిసినవారు కోరంగి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.


నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

ఓవర్ పెయిడ్ ఉద్యోగులకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - యానాం

ప్రజా పనుల శాఖలో ఓవర్ పెయిడ్ ఉద్యోగులకు సిఐటియు మద్దతు తెలిపింది. తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గా ప్రసాద్, నాయకులు ఇళ్ల వాసు వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలను రూ.18 వేలు చేస్తామనిసీఎం రంగసామి హామీ ఇచ్చారని, కానీ ఆ హామీని అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.10 వేలతో కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఉండాలన్నారు. వీరని ఎంటిఎస్ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగబాబు, కలిదిండి అచ్యుత రామరాజు, కాలాడి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, చీకట్ల శ్రీనివాస్, మన్నే మురళి, పంపన అప్పన్న బాబు, అడప దయానందస్వామి, కె.వెంకటాచలం, దడాల సత్యనారాయణ పాల్గొన్నారు.

80 శాతం మంది ఆయుర్వేదంపై ఆధారం

ప్రజాశక్తి - సామర్లకోట

వివిధ రుగ్మతలకు వైద్యం కోసం భారత్‌తో పాటూ నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక తదితర దేశాల్లో 80 శాతం జనాభా ఆయుర్వేద వైద్య విధానాన్ని ఆచరిస్తున్నారని అచ్చంపేట ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.షాజిద్ అలీ తెలిపారు. ఆయుర్వేద వారోత్సవాల సందర్భంగా అచ్చంపేట ఎంపియుపి పాఠశాలలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేదంపై విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సామర్లకోట ఎంఇఒ-2 పి.పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలీ ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. ఎంఇఒ-2 పి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆయుర్వేద వైద్యంపై అవగాహన పెంచుకోవడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వేదాద్రిశ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

ఎస్ఆర్ మూర్తి సేవలు అందరికీ ఆదర్శనీయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మాజీ ఎంపిపి అరదాడి కృష్ణకుమారి భర్త, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్ఆర్. మూర్తి సేవలు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. గురువారం మూర్తి సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ పేరయ్య రాజు, బిళ్ళకుర్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. జాతీయ కబడ్డీ, హాకీ క్రీడాకారుడుగా, వ్యాయామ ఉపాధ్యాయుడుగా విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దరమే కాకుండా, ఆ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహరాజు, యండమూరి శ్రీనివాస్, మల్లాడి వరదరాజు, కొల్లు వీరబాబు, చీకట్ల శ్రీనివాసరావు, సంగాడి నూకరాజు పాల్గొన్నారు.

మత్తుకు లోనవుతున్న యువత

-తల్లిదండ్రుల నిర్లక్ష్యమే కారణమా?

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పుట్టిన బిడ్డను అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదలను చూసి ఆనందిస్తుంటారు. చదువులో ఉత్తమ ప్రతిభను చాటుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తారు. కానీ నేటి తరం చిన్న వయసు నుంచే చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు. సిగరెట్లు, మత్తు పానీయాలు సేవిస్తూ పెడదోవ పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లవలసిన వయసులో చెడు అలవాట్లకు బానిసలు అయిపోతూ వారి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తున్నారు. యు.కొత్తపల్లి మండలంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో చోట్ల చేసుకుంటున్నా గురువారం ఇలాంటి సంఘటన చోటుచేసుకుంది. 13 సంవత్సరాలు వయసు ఉన్న బాలుడు యథేచ్ఛగా సిగరెట్ కాలుస్తూ కనిపించాడు. సిగరెట్, మద్యం ఆరోగ్యానికి హానికరమని టీవీ, సినిమాల్లో ప్రకటనలు చేస్తున్న నేటితరం పట్టించుకోకుండా ఆరోగ్యాన్ని చిన్న వయసు నుంచే పాడు చేసుకుంటున్నారు. చెడు అలవాట్లకు బానిసలైన యువత డబ్బుల కోసం అక్రమ మార్గాలు ఎన్నుకుని జైలు పాలు అవుతున్న సంఘటనలు కళ్ల ముంగిట కన్పిస్తూనే ఉన్నాయి.


చిన్న వయసులోనే సిగరెట్ కాలుస్తున్న బాలుడు

తల్లిదండ్రుల నిర్లక్ష్యమా?

ఇంటికి ఒక్కడే కొడుకు అని...ఇంటికి పెద్దవాడు అని...లేదా చిన్నవాడు అని... ఇలా పలు కారణాలతో ఎంతో గారాభంగా పెంచేందుకు అధిక శాతం తల్లిదండ్రులు మక్కువ చూపుతున్నారు. ఏది అడిగినా అది ఇవ్వడం నేటి పరిస్థితుల్లో ఒక అలవాటుగా మారిపోయింది. చిన్ననాటి నుంచే విచ్చలవిడితనంతో పెరుగుతున్న పిల్లలకు 12 లేదా 13 సంవత్సరాల వయసు వచ్చే సమయానికే చెడు అలవాట్లకు లోనౌతున్నారు. స్కూల్‌కు వెళ్తున్నాడు? వాటికైనా అవసరం అత్తుతాయి అని లెక్కకు మించి ఖర్చుల కోసం డబ్బులు ఇవ్వడంతో ఆ విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారనే అభిప్రాయాలు పరిశీలకుల వ్యక్తం చేస్తున్నారు. అవసరానికి ఉపయోగపడ తాయిలే అని ఇచ్చే డబ్బులతో సిగరెట్, గుట్కా వంటి మత్తు పదార్థాల కోసం వినియోగిస్తున్న సందర్భాలు లేకపోలేదు. సిగరెట్, గుట్కా వంటి వాటికి అలవాటు పడుతున్న విద్యార్థులు యుక్త వయస్సుకొచ్చే సమయానికి మద్యానికి బానిసగా మారుతున్నారు. మద్యంతోపాటు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను కొనుగోలు చేసుకునేందుకు డబ్బులు లేకపోతే చోరీలు, సైబర్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టణ, నగర కేంద్రాల్లో సులువుగా డబ్బులు సంపాదించేందుకు బ్లేడ్ బ్యాచ్‌లుగా ఏర్పడి రాత్రి సమయాల్లో రోడ్డున పోయే ప్రయాణికులను బ్లేడ్‌లతో బెదిరించి వారి దగ్గర ఉన్న డబ్బులు, ఇతర బంగారు వస్తువులను ఎత్తుకుపోతున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

యుక్తవస్సు ప్రత్యేక దృష్టి అవసరం

యుక్త వయస్సు వచ్చిన నాటి నుంచే వారిపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థుల వ్యవహార శైలి, వారి నడవడిక, విద్యపై శ్రద్ధ, ఇతరులు పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరంతరం పర్యవేక్షించడం ద్వారా యువతను కాపాడుకునే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి ఆ విద్యార్థిలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తల్లీదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పాటు సరియైన కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా భవిష్యత్ మానవ వనరులను కాపాడుకోవడానికి అస్కారం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

చొల్లంగిపేట ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి - తాళ్లరేవు


విచారిస్తున్న ఏపీడీ వసంతమాధవి

మండలంలోని చొల్లంగిపేట ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కారే జ్యోతిపై పలువురు చేసిన ఫిర్యాదులపై డ్వామా ఏపీడీ వసంత మాధవి గురువారం విచారణ చేపట్టారు. పలువురు ఉపాధి వేతనదారులను విచారించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పుట్టిస్తాయిలో పనులు కల్పించడం లేదని, భార్య భర్తలు వస్తే తప్ప పని ఇవ్వడని చెప్పడం, అదేవిధంగా జాబ్ కార్డులు ఇవ్వడం లేదని పలువురు వాపోయారు. 2018 లో తీసుకున్న హౌసింగ్ రుణాలను సామాజిక తనిఖీలో భాగంగా రికవరీ సంబంధించి రూ. 18,500 తమ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి కట్టించుకుందని హౌసింగ్ లబ్ధిదారులు శెట్టి వరలక్ష్మి వివరించారు. అలాగే తన వద్ద రూ.5000 రికవరీ కట్టించుకుందని పెంకె భాగ్యలక్ష్మి తెలిపారు. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతిని వివరణ కోరగా ఆ నగదు మొత్తాన్ని సంబంధిత అధికారులకు చెల్లించినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేస్తామని ఏపీడీ వసంత మాధవి అన్నారు. ఈ ఏడాది జూలై 1న నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామసభకు తనకు సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ కందెళ్ళ గంగాభవాని ఫిర్యాదు చేశారు. ప్రతి ఉపాధి పనికి పంచాయతీ తీర్మానం చేయాల్సి ఉంటుందని, స్థానిక సర్పంచ్, కార్యదర్శి ఇతర అధికారులను సమన్వయం చేసుకుని పనులు నిర్వర్తించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. అనంతరం ఏపీడీ విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదులో పలు ఆరోపణలు ఉన్నాయని, విచారణ చేశామని, స్టేట్‌మెంట్ రికార్డు చేసి డ్వామా పీడీకి నివేదిక సమర్పిస్తానని తెలిపారు. ఈ విచారణలో తాళ్లరేవు ఎపిఏ తేజస్వి, నాయకులు కందెళ్ళ గంగబాబు, మైదు హరిబాబు, మందాల సత్తిబాబు, నరాల రాంబాబు, కారే రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, ఉపాధి హామీ టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

కూల్చిన చోటే ఇల్లు నిర్మించాలి


నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పెదపూడి

బాధితులకు కూల్చిన చోటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం దోమడ చెరువు గట్టున షేక్ అమ్మాజీ ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. కూల్చిన చోటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఆర్ అండ్ బి స్థలంలో నివాసముంటున్న 9 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయాలని, ఇల్లు కూల్చిన గణపతి వెంచర్ అధినేత తుమ్మలపల్లి గోవిందరాజులు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరాన్ని ఎపి ఎంఆర్‌పిఎస్ నాయకులు మందపల్లి సత్యనారాయణ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గుబ్బల ఆదినారాయణమూర్తి, దళిత ప్రజా చైతన్యం రాష్ట్ర అధ్యక్షులు బుంగ సతీష్ మాట్లాడారు. గత 70 ఏళ్లుగా ఆర్ అండ్ బి స్థలంలో పది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఇంటి పన్ను, కరెంటు బిల్లు చెల్లిస్తున్నారని అన్నారు. అనంతరం ఇళ్లను కూల్చివేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్త అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సిఐ సూర్యఅప్పారావు పిలుపునిచ్చారు. గురువారం ప్రకృతి పరిరక్షణ సంస్థ, స్పార్క్ ఫౌండేషన్ సంయుక్తంగా నవంబర్ 1న నిర్వహించే సైబర్ ప్రోలాక్ హ్యాకింగ్ అవగాహన సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సైబర్ నేరాల నుంచి ఎలా తప్పించుకోవాలి, మహిళలు ఎలా రక్షణ పొందాలి అనే విషయాలపై సిఐ అవగాహన కల్పించారు. ప్రకృతి పరిరక్షణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయబాబు మాట్లాడుతూ నవంబరు 1న వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో జరిగే ఈ అవగాహన సదస్సును ఎంఎల్ఏ వరుపుల సత్యప్రభ ప్రారంభిస్తారని, పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, తదితరులు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ అవగాహన సదస్సులో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, స్పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎస్.సాయిసందీప్, కోఆర్డినేటర్ రవికిరణ్, ప్రకృతి పరిరక్షణ సంస్థ సభ్యులు రౌతు సహదేవుడు, నారాయణరావు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిఐ సూర్యఅప్పారావు

అధికారులను నిలదీసిన రైతులు

ప్రజాశక్తి - కోటనందూరు

భూ సమస్యలపై అధికారులను రైతులు నిలదీశారు. గురువారం మండలంలోని అల్లిపూడిలో రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో తహశీల్దార్ టి.సుభాష్, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో నిర్వహించిన భూ సర్వేలో తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తప్పుడు తడకలుగా చేయడం వల్ల ఆన్‌లైన్‌తోపాటు, రికార్డుల్లోనూ ఎక్కువ తక్కువగా చూపించారని అన్నారు. తప్పులను తక్షణమే సరిచేసి తమ డాక్యుమెంట్ల ప్రకారం భూమిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

వ్యాసరచనలో శ్రీసాయికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కరప

జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వేములవాడ జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని ఎస్.పూర్ణశ్రీసాయి ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం ఎన్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాస్థాయిలో స్వర్ణాంధ్ర-2047 అంశంపై కాకినాడలో నిర్వహించిన వ్యాచరచన పోటీల్లో తమ విద్యార్థి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి డిఇఒ రమేష్ చేతుల మీదుగా బహుమతిని అందుకుందన్నారు.


సర్టిఫికెట్‌ను అందుకుంటున్న శ్రీసాయి



పాఠశాలకు ఫ్యాన్లు బహూకరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ తాతీలు

గురుకుల పాఠశాలకు 20 ఫ్యాన్ల బహూకరణ


ప్రజాశక్తి - కరప

స్థానికగురుకుల పాఠశాలకు కాకినాడ రోటరీ క్లబ్ 20 ఫ్యానులను బహూకరించిందని ప్రిన్సిపల్ కెవి.రామకృష్ణ తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతి గదుల్లో ఫ్యాన్లు లేకపోవడంతో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కాకినాడ రోటరీ క్లబ్‌ను సంప్రదించారని తెలిపారు. తక్షణమే రోటరీ క్లబ్ స్పందించి 20 ఫ్యాన్లు అందించారని వివరించారు. ఈ సందర్భంగా పోలిశెట్టి తాతీలును స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాతీలు మాట్లాడుతూ రోటరీ క్లబ్ నిర్వాహకులు స్కూల్‌కు అవసరమైన లైట్లు, బ్లాక్ బోర్డులు అందజేస్తామని చెప్పారని, త్వరలోనే వాటిని అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పోలిశెట్టి ఈశ్వరరావు, సెక్రటరీ వివి.సత్యనారాయణ, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పివిజిఎల్.సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎస్‌ఎంసి ఛైర్మన్ జి.రామ వెంకటసత్యనారాయణ, మంచాల శ్రీనివాస్, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు పేకేటి ప్రసాద్, నాయకులు చిన్నారి శ్రీను, వాసంశెట్టి మహేష్ పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులతో సైన్స్ ప్రయోగాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని ఎసిటి సైన్స్ సెంటర్‌లో గురువారం శ్రీ వీర్రాజు హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఎఫ్ఎ 2 సిలబస్, ఫిజికల్ సైన్స్, ఆమ్లాలు, లవణాలు, ప్రాక్టికల్స్, సహజ సూచికలతో యాసిడ్లు, బేస్‌ల పరీక్ష, లిట్మస్ టెస్ట్ సింథటిక్ ఇండికేటర్స్ టెస్ట్, కండక్షన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ టెస్ట్, పిహెచ్ స్కేల్‌తో విభిన్న యాసిడ్లు, విభిన్న వర్కు షీట్ తో బేస్‌ల ప్రయోగాలను విద్యార్థులతో చేయించి వారికి అవగాహన కల్పించారు. మిషన్ అన్నపూర్ణ సహాయనిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు.


విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న శ్రీనివాస్

ఆదమరిస్తే అంతేసంగతులు...

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణంలో ఆదమరిచి ప్రయాణించామా... ప్రమాదానికి గురికాక తప్పదు. కారణం ఏళ్లనాటి కల్వర్టులు శిథిలమైన ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీలమ్మ చెవువు గట్టుపై తోట గోపాలకృష్ణ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డుకు మధ్యలో కల్వర్టులు గోతులు పడి అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఏళ్ల తరబడి ఈ పరిస్థితి ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజూ ఈ రహదారి మీదుగానే రాక పోకలు సాగిస్తున్నారు. కల్వర్టులపై ఉన్న గోతుల్లో పడి విద్యార్థులు గాయపడిన ఘటనలు కోకొల్లలు. కల్వర్టుల మరమ్మతుల కోసం సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. రోడ్డు పక్కన సిమెంట్ దిమ్మలు వేసినా వాటిని అమర్చకుండా వదిలేశారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఇలాంటి శిథిల కల్వర్టులు న్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


తోట గోపాలకృష్ణ పాఠశాల రోడ్డులో ప్రమాదకరంగా కల్వర్టు

సభ్యత్వ నమోదులో అగ్రస్థానం సాధించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తాళ్లరేవు మండలం అగ్రస్థానం సాధించాలని మండల కార్యదర్శి కట్ట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో అమలాపురం పార్లమెంటరీ స్థాయి నాయకులు టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈనెల 26వ తేదీ నుంచి డిసెంబర్ 18వ తేదీ వరకూ మండలంలోని అన్ని పంచాయతీల్లో సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. ప్రతి పంచాయతీకి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సాంకేతిక సిబ్బంది ఆయా పంచాయతీలకు కేటాయించిన తేదీల్లో రానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నడింపల్లి వినోద్, మోపూరి వెంకటేశ్వరరావు, ఉంగరాల బూరిబాబు, పొన్నమండ రామలక్ష్మి, వాడ్రేవు వీరబాబు, ధూళిపూడి బాబి, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, భజన సత్తిబాబు, జక్కల ప్రసాద్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కట్ట త్రిమూర్తులు

విద్యార్థులకు మాక్ పోలింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యార్థులకు సామాజిక అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి చొల్లంగి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పూజారి పద్మావతి మాట్లాడారు. ఎన్నికల పట్ల అవగాహనతో పాటు ఉన్నత నాయకత్వ లక్షణాలు విద్యార్థులు అలవర్చుకోవాలని కోరారు. యాక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో కొందరు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి, నమూనా ఓటర్ గుర్తింపు కార్డులు తయారుచేసి ఎన్నికలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, ఉపాధ్యాయులు హైమావతి, పార్వతి, రమణి, రోహిణి, ఉష పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడు చెందిన 10వ తరగతి చదువుతున్న చెక్కపల్లి వెన్నెల ఆత్మహత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు బాల గంగాధర్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో ప్రయివేటు పాఠశాలలు, కాలేజీలు యాజమాన్యాల వేధింపుల వల్ల అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. తక్షణమే విద్యార్థి ఆత్మహత్యకు కారణాలపై రాష్ట్రప్రభుత్వం విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హుండీల ఆదాయం రూ.16 లక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ తనిఖీ అధికారి ఫణికుమార్ లెక్కింపును పర్యవేక్షించారు. హుండీల ఆదాయం నగదు రూపంలో రూ.15,87,647 లు, విదేశీ కరెన్సీ రూ.12,492, వెరసి మొత్తం రూ.16,00,139లు ఆదాయం వచ్చినట్లు ఇఒ చెప్పారు. ఈ కార్యక్రమములో ఉండూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ సేవాసంఘం సభ్యులు, మాజీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, వాలంటీర్‌లు, మహిళా భక్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరంగనాయకపురంలో అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక శ్రీరంగనాయకపురం గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రైతాంగ సమస్యలపై గ్రామసభలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పెద్దాపురం

రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎస్‌కె.మస్తానీ సూచించారు. గురువారం గొల్లప్రోలు మండలం మల్లవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను తహశీల్దార్ స్వీకరించారు. కొన్ని సమస్యలకు పలు సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో మండల సర్వేర్ కేదారేశ్వరరావు, సర్వేయర్ సూర్యనారాయణ, విఆర్ఒలు పాల్గొన్నారు. పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో భూ యజమానుల నుంచి 19 ఫిర్యాదులు అందాయి. గురువారం జరిగిన గ్రామ సభకు సర్పంచ్ దేవళ్ల దుర్గావరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సభలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీకుమారి పాల్గొని మాట్లాడారు. గ్రామ సభలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి తప్పులను సరిదిద్దడం జరుగుతుందన్నారు. గ్రామ సభలో మోతుకూరి ఆదినారాయణ, పాలచర్ల ఉమామహేశ్వరరావు, గొల్లపల్లి భద్రం, పంచాయితీ కార్యదర్శి కళావతి, విలేజ్ సర్వేయర్ కాకినాడ సాయిమహేశ్వర్, విఆర్ఒ చెన్ను అక్షయ్ పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా కూటమి పార్టీల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకోవాలని కూటమి పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో కూటమి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, సూపర్ బజార్ ఛైర్మన్ నర్సింగ్ ఆదినారాయణ, కూటమి నాయకులు సి.రామ్‌కుమార్, మల్లిపూడి వీరు, పెంకే శ్రీనివాస్ బాబా, ఒమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, జహీరుద్దీన్ జిలాని, గుత్తుల రమణ, సంగాని నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, ముగ్గుళ్ల బాబూరావు, చిందాన సూరిబాబు, నమ్మి సత్య వేణి, పిల్లారిశెట్టి రాజేశ్వరి, సుంకర తిరుమల కుమార్ పాల్గొన్నారు.

వేగంగా ట్యాంక్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తూర్పుపాకలు గ్రామంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని టిడిపి గ్రామ ఇన్‌ఛార్జ్ పడాల వీరరాఘవులు తెలిపారు. గురువారం సర్పంచ్ పడాల అన్నపూర్ణతో కలిసి ఓటర్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్ పథకంలో రూ.33.5 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే పైపులైన్ పనులు పూర్తియ్యాయని, ట్యాంకు నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.